# కొడితే పిల్లలా!

ఆర్.కె. కటూరి




"మనిషిలో రాక్షసుణ్ణి చూశానోయ్ రాత్రి!"

ఉలిక్కిపడ్డాడు పక్క సీటులో పని చేసుకుంటున్న యూనుస్. కొత్తగా చూశాడు మోహన్రావు ముఖంలోకి. అతని మాటలు బోధపడలేదు. వచ్చినప్పటినుంచి అతని తీరుకూడా అర్థం కాలేదు.

ఎప్పుడూ సీటుకి రాగానే ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడకుండా చకచకా పనిచేసుకు పోయే మోహన్రావు ఆ రోజు బీరువా తెరవ లేదు — కలం బయటికి తీయలేదు. దిగులుగా ఏదో ఆలోచిస్తూ కూర్చుండి పోయాడు.

"ఏమిటి భాయ్! నువ్వనేది?"

"రాత్రి రాక్షసంగా ప్రవర్తించానోయ్!" బాధగా అన్నాడు.

"ఏమైంది భాయ్?" అదేదో అతనికి సంబంధించిన సంఘటనేనని ఆతృతగా అడిగాడుయూనస్.

"రాత్రి మా పిల్లవాణ్ణి అమానుషంగా కొట్టానోయ్!"

ఒకింత దుఃఖం ఒలికింది అతని మాటల్లో.

"అట్లా ఎట్లా కొట్టావ్ భాయ్! అంత తప్పు ఏం చేశాడు?"

"హ్రూ! అదో పెద్ద తప్పు కూడా కాదు! మనం ఎంత దండించినా అంతలోనే మరిచిపోతారు పిల్లలు! వాళ్ళ ప్రవర్తనే అంత! కాని మనలో ఉన్న రాక్షసుడు మేలుకున్నప్పుడు ఆ స్ఫురనే రాదు మనకి. గొడ్డుని బాదినట్టు బాదేస్తుంటారు పిల్లల్ని!"

"అసలేం జరిగింది భాయ్?"

"ఏమిటోయ్ యూనస్. వాడి పిల్లవాణ్ణి కొట్టిన సంగతేనా చెబుతూంట? ఇవాళ ఆఫీసులో ఎవరికీ పనిచేసుకునే పనుండదు!" హేళనగా నవ్వుతూ అప్పుడే ఆఫీసు కొచ్చిన దామోదరం పలకరించాడు.

"నోరు ముయ్యవోయ్, చెప్పొచ్చావ్ పెద్ద ..." దామోదరాన్ని కసురుకొని పనిలో నిమగ్నమయ్యాడు మోహన్రావు.

* * * *

కాంటీన్‌లో మోహన్రావు, సుబ్రహ్మణ్యం కూర్చొని ఉన్నారు. మోహన్రావు సుబ్రహ్మణ్యంతో చెబుతున్నాడు —

"... సరుగుడు పుల్లతో చేతికొచ్చినట్టు కొడుతున్నాను. వాడు భయంతో వణుకుతూ దెబ్బలకి మెలికలు తిరిగిపోతున్నాడు. నా నిసెస్సేమో పూరుకోండి, పూరుకోండి' అంటూ ఏడుపు గొంతుతో నా చేతుల కడ్డం పడుతోంది. అదేమిటో ... ఆ క్షణంలో దయ్యం పడుతుందో ఏమో, ఇంకా కొట్టాలనే అనిపిస్తుంది. అది రాక్షస ప్రవృత్తిగాక ఏమవుతుంది. ఎదటి వాడు బాధతో మెలికలు తిరిగి పోతుంటే ఇంకా హింసించడం రాక్షసత్వమే మరి!

వాడు దెబ్బల బాధకి తట్టుకోలేక గగ్గోలుగా ఏడుస్తున్నాడు అంతంత దెబ్బలకి పిల్లవాడు ఎలా వోర్చుకోగలడు! కాని అప్పు డా జ్ఞానం ఉంటేగా! అలా ఏడవటం కూడ భయ రాహిత్యమే నన్నట్టుగా సహనం చచ్చిపోయి 'ఏమిటా ఏడుపు భయం లేకుండా? నోర్మూయ్!' అని రంకె వేశాను, రవుద్రాకారంతో పుల్ల పట్టుకున్న చెయ్యి పైకెత్తుతూ. అంతే! ... చేతితో నోరు మూసుకున్నాడు. టక్కున ఏడుపు ఆగిపోయింది. గుడ్లు పెద్దవిచేసి మిటకరించినట్టు చూపు నిలిపేశాడు, కాళ్ళు, చేతులు ఎక్కడి

నక్కడ బంద్! ఒ చిత్తరువులా, శిల్పంలా ఉండి పోయాడు.

వాడి రూపాన్ని చూసి నా అహమే తృప్తి [illegible], నా అంతరంగమే జంకిందో, బింకం విడవ 'ఇంకెప్పుడైనా ఇలా చేశావా—నీ రక్తం కళ్ళ జూస్తాను, రాస్కెల్!' అని వార్నింగిచ్చి పుల్లని విసురుగా నేలకేసి కొట్టి గదిలో కెళ్ళిపోయాను.

'చెబితే వింటార్రా! నా కడుపు రగిలిస్తానికి పుట్టార్రా మీరు!' అని కళ్ళు ఒత్తుకుంటూ నా మిసెస్ వాణ్ణి వంటింట్లోకి లాక్కుపోయింది.

నోరు మూయమన్నప్పుడు వాడిలో ఏర్పడిన భంగిమ నా మనసులో ముద్రపడింది. అది తలపు కొస్తే ఏదో భయం! అట్లాగే వాడి గుండె ఆగి పోయి ఉంటే? ..."

"ఔను మోహన్రావుగారూ! వాళ్ళ ఆయువెంత? షాక్ వల్ల గుండె ఆగినా ఆగిపోవచ్చు! లేదా ఏదన్నా ఆయువు పట్టున తగిలినా ప్రమాదమే! కంటి భయంతో పట్టుకు రావాలి గాని, అంతచేటుగా కొట్టకూడదు!"

"ఒదేనండీ! రాత్రినుంచి నా మనసులో వాడి రూపం మెదిలినప్పుడల్లా గుండెల్ని పిండేస్తోంది బాధ! చ! ఇంకెప్పుడూ పిల్లల మీద చెయ్యి చేసుకో కూడదు!"

సడన్‌గా పెద్ద నవ్వు వినిపిస్తే వెనక్కి తిరిగి చూశా రిద్దరూ, వెనకనే నిల్చుని తను మాటలు వింటున్నాడు దామోదరం. నవ్వాపి సుబ్రహ్మణ్యంతో అన్నాడు.

"ఏరా! సుబ్రం? బోర్ కొట్టటం లేదా 'మోరా' గాడి మొర?"

"ఒరే 'దారం!' నీకు ప్రతిదీ వేళాకోళమేనా?" సీరియస్‌గానే అడిగాడు సుబ్రహ్మణ్యం.

"కాకపోతే? ... ప్రపంచంలో వీడొక్కడే పిల్లల్ని కొట్టినట్టు కనబడ్డ వాడికల్లా చెప్పు కుంటూ, తెగ బాధపడి పోతున్నాడయ్యా పొద్దు ట్నుంచి!"

"అతని బాధ అతనిది. మధ్యలో నీకేమిటయ్యా బాధ?"

"సామెతల గ్రంథంలో ఏం చెప్పబడిందోతెలుసా? 'పిల్లలను ప్రేమించు తండ్రి వారిని శిక్షించును' అని."

"నాయనా! నీ పరిజ్ఞానానికి మెచ్చుకున్నాం, నువ్వు పిల్లలను అమోఘంగా ప్రేమించు తండ్రివి! ఒప్పుకున్నాం. ఇక మమ్మల్ని వదులు!"

"నే నెప్పుడూ పిల్లల్ని ఈ విధంగా కొట్ట లేదండీ! దీనికంతా కారకుడు వీడే! పొరుగింట్లో వీ డెప్పుడూ పిల్లల్ని బాదేస్తుంటే, ఆ జాడ్యం నాకూ అంటు కుంది!" సంజాయిషీ పూర్వకంగా చెప్పాడు మోహన్రావు.

"పిల్లల్ని కొట్టకపోతే ఎలాగోయ్! మాట వింటారా? భయభక్తు లెలా ఏర్పడతాయ్? కొట్టక పోతే వాళ్ళని మనమే చెడగొట్టిన వాళ్ళ మవుతాం."

"అలాగే! నీ పిల్లల్ని భయభక్తులతోనే పెంచుకో! పోతే నా పిల్లలే చెడిపోతారు!" అని నిష్ఠూరంగా అంటూ మోహన్రావు సుబ్రహ్మణ్యంతో బయటికి నడిచాడు.

• • •

ఆఫీసయ్యాక ఇంటి కొస్తుంటే దారి పొడుగునా అవే ఆలోచనలు మోహన్రావుకి. రాత్రి దృశ్యాలే కనిపిస్తున్నాయి మన నేత్రానికి.

[illegible] తప్పు చేశాడు తను అంతగా కొట్టడానికి? తనవల్ల ఏదైనా నష్టం జరిగినా, పొరపాటు జరిగినా సహజమైన బిడియంతో నిజం చెప్పటానికి సంకోచిస్తారు పిల్లలు. చేరదీసి నెమ్మదిగా అడిగితేనిజంచెప్పేస్తారు. ఎందుకుఅబద్ధాలాడకూడదో వాళ్ళు చేసిన పనుల పరిణామా లెలా ఉంటాయో వివరించి బోధపరిస్తే, వాళ్ళ మనసుకి బాగా హత్తు కుంటుంది. కాని పిల్లవాడు ఏదో అబద్ధ మాడాడని లేనిపోని క్రోధావేశంతో శివమెత్తి చెండాట్టం మానవత్వ మెలా అనిపించుకుంటుంది?

మొదటినుంచీ తన భావాలివే. కాని రాత్రి తననేం ఆవహించిందో బాబుని నిర్దాక్షిణ్యంగా కొట్టాడు. ఉద్రేకంతో కొట్టడమే గాని తర్వాత ఎంత మానసిక వేదనకి గురి కావాలి!

కొట్టిన కోపంలో ఇంకేమీ పట్టించుకోకుండా తన పనులన్నీ పూర్తి చేసుకున్నాడు. పడుకోబోయే ముందు తన భార్య బాబు వంటి మీద తేలిన వాతలని చూపించింది — "ఎంత కోపమొచ్చినా ఇంత ఇదిగా కొట్టుకుంటారా పిల్లల్ని?" అని గాద్గదిక స్వరంతో మందలింపుగా అంటూ.

చేతుల మీద వీపు మీద, కాళ్ళమీద పొంగి ఉన్నాయి వాతలు — ఎర్రగా నెత్తురు చెమ్మతో! అవి చూడగానే తన శరీరమంతా ఏదో మంట పుడుతున్నట్టు గగుర్పాటు! ఎక్కడలేని దుఃఖం పొంగు కొచ్చింది. ప్రేమగా బాబు ఒంటిమీద చేతితో నిమిరాడు ... వాటి మంటలకి బాబు స్నానం చెయ్యలేడట. మందు కూడ సరిగా పూయనివ్వ లేదట. అన్నం కూడ తినకుండా సొమ్మసిల్లి మంచం మీద వాలిపోయాడట!

తన కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి. మనసంతా ఆవేదన! ఏమిటి ఈ చేతలకి అర్థం? ఇది చదువు, విజ్ఞానం ఉన్న వాళ్ళు చేయవలసిన పనేనా? తలుచు కున్న కొద్దీ దుఃఖం ఆగటం లేదు. తను పాశవికంగా ప్రవర్తించాడు. ఇందుకు తనని శిక్షించే దెవరు?

భార్యతో చెప్పాడు — "రేపు నేను లేనప్పుడు బాబుకి నెమ్మదిగా చెప్పు. నిన్ను కొట్టినందుకు నాన్న చాలా బాధపడ్డాడు, చూశావా, దెబ్బలుతింటే తిన్నందుకు నీకు బాధ — కొట్టినందుకు నాకు బాధ, ఇంకెప్పుడూ నాన్నగారికి కోపం తెప్పించే పనులు చేయకు అని" చెప్పమని.

'చెప్పే ఉంటుంది. ఆ మాటలు బాబు మీద ఎలా పనిచేస్తాయో చూడాలి' అనుకుంటూ ఇంట్లో అడుగు పెట్టాడు మోహనరావు.

ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. వంట గదిలోంచి మాత్రం ఏవో చిన్న చిన్న చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. తన భార్య వంట చేసుకుంటోంది, పిల్లలంతా బయటి కెళ్ళిన ట్టున్నా రనుకుంటూ మోహన్రావు మౌనంగా బట్టలు మార్చుకుంటున్నాడు.

వంటింట్లోంచి అతని భార్య మాటలు వినిపించాయి.

"నాన్నగా రొచ్చినట్టున్నారు, చూడు."

## ఒక దానికన్న మరొకటి

ఒకదానికన్న ముందు మరొకటి
ఒరిగే అశాంతి ఆర్తి మనసులో
ఒకదానికన్న వెన్క మరొకటి
అరుదైన తృప్తి శాంతి బ్రతుకులో

ఇంటిలోకి అడుగు వేయడం ఒక విశ్రాంతి
ఇంటి నుండి బయట దూకడం ఒక విశ్రాంతి
ఎక్కడుంది? బ్రతుకులో మహోదధి! విశ్రాంతి
భ్రాంతి భ్రాంతి నడకలోన? చక్రగతుల్లోన?

రాళ్ళనో పీరీలనో అడుగు చెబుతాయి
లేకపోతే డాక్టరు నడుగు చెబుతాడు
గుండెశబ్దంతో బ్రతుకు బరువు గుణించి
లేకపోతే శూన్య దిశకు మనసు త్రిప్పు!
తేలేను నౌక వలె మనస్సు నీటిపై
రానున్న సుందర్భులను గురించి వూహతో

ఉన్నట్లుండి ఏ ప్రాణి వరిగేనో అని
నిశ్శబ్దాని కెంత భయమో? ఇక్కడ!
రోడ్‌పై శబ్ద వేగాల సరదా ఎంతని?
కవ్వించేను మానవ సమూహాలను!
కూలిపడే శబ్ద శిఖరాల వాలులోనే
ఇక్కడ చిత్రాలు కదలేను పట్టనట్లే

ఒకచోట ఎదురు తిరిగి అన్యాయం
పొందేను అశేష చటుల క్రుధారూపం!
ఒక రాపిడికి రగిలిన పోరాటం
అయ్యేను చరిత్ర మలుపుకు చైతన్యం!

రావాలి క్షణాలు
పాతాళం నుండి భూమికి
దూకాలి క్షణాలు
ఆకాశం నుండి నేలకు!

జీవితాన్ని స్పందించే శక్తితో
దిక్కులన్ని వెల్గించే రేఖతో

కదలిపోయి రాత్రి చరణం
కనుల ముందు అనంతం
కరిగిపోయి స్వప్న తుహినం
వెలుగు వాన్తగా కావీ!

వూహలోన చూపులతో
వెల్గనీడ బొమ్మలతో
ప్రాణమాడుదాక సదా
జీవితం యథార్థభరం

— మాదిరాజు రంగారావు

మరు నిమిషంలో బాబు తనున్న గదిలోకి తొంగి చూసి "నాన్నగారొచ్చా రమ్మా" అంటూ వచ్చి నట్టే వెళ్ళిపోయాడు.

అంటే పీడా వంటింట్లో ఉన్నాడన్న మాట! మిగతా పిల్లలిద్దరూ ఇంట్లో ఉన్న అలికిడి లేదు. మళ్ళీ వెంటనే భార్యమాటలు వినిపించాయి.

"నాన్నగారు ముఖం కడుక్కుంటారు. బాత్ రూంలో సబ్బు, టవలు పెట్టిరా."

బాబు ఆడుకోటానికి వెళ్ళే సమయంలో తన దగ్గరే ఉంచుకోవటం, తను చూసే ప్రతిపనీ పిల్ల వాడికి పురమాయించటం ... విషయం అర్థమైంది మోహన్రావుకి.

లుంగీ చుట్టుకొని బాత్‌రూం వైపు వెళ్ళాడు. అప్పుడే బాబు బాత్ రూం లోంచి వస్తూ తనని చూసి చిరునవ్వు చిందించి వంటింట్లోకి తుర్రు మన్నాడు. బెట్టుగా ఉండాలని మోహన్రావు బాబు చిరునవ్వుకి ఎలాంటి స్పందన కనబడనీయలేదు.

ముఖం కడుక్కొని వచ్చి ఈజీచైర్లో కూర్చు న్నాడు. తన వెనకాలే బాబు ఒక ప్లేటునిండా వేడి వేడి పకోడీలు పట్టుకొచ్చి "నాన్నా! అమ్మ మెత్తటి పకోడీలు చేసింది" అని సంతోషంగా చెబుతూ ప్లేటు చేతికిచ్చి వెంటనే నిల్చున్నాడు.

అప్పటికీ బాబుతో మాట్లాడలేదు మోహన్రావు. బాబుకి తినమని ఏమీ పెట్టకుండా తనే ఒక్కొక్కటి తింటూ, మనసులోని ఘర్షణ వింటున్నాడు.

తనవల్ల హింసపడ్డవాడు బాబు! అయినా అదంతా మరిచిపోయి స్నేహ భావంతో తనకి సేవలు చేస్తు న్నాడు. కాని తనో?

బాబుని హింసించిన వాడై యుండి కూడ ఇంకా అర్థంలేని భేషజానికిపోతూ బాబు పలకరించినా వాడిని చేరదీయక పో తున్నాడు.

ఇదేనా — ఇంత విజ్ఞానం, లోకానుభవం తనకి నేర్పిన సౌమనస్యం? సహృదయత లోపించినప్పుడు ఇవన్నీ నిరర్థకం కాదా?

ద్వేషానికి అతీతమైన నిష్కల్మషమైన మనసులు పిల్లలవి. అందుకే వాళ్ళని దేవుడితో పోల్చారు. మరి, తనని దానవుడితో పోల్చవచ్చుగదా?

తనకన్నా బాబు ఎంతో ఉన్నతుడిగా తోచాడు. తలొంచుకొని పకోడీలు తింటున్న మోహన్రావు తల ఇంకాస్త వంగిపోయింది.

బాబుని ఇంకా లక్ష్యపెట్టక పోవటం మానవతకే కళంకం అనిపించి పకోడీ ముక్కలు పెడుతూ బాబు ముఖంలోకి చూశాడు. పువ్వులా వికసించింది బాబు ముఖం. పరమ సంతోషంగా తీసుకున్నాడు. —

మోహన్రావు హృదయంలో ఒక వింత పులకింత!
మనసులో మల్లెల గుబాళింపు!

"పాప, బుజ్జి ఏరీ?"

"అరుణ వాళ్ళింట్లో ఆడుకుంటున్నారు నాన్నా!"

మాటల లేగదూడల చెంగలింపు.

పంచెవన్నెలు పరచుకున్న మానసాకాశం!

దేవతలా ప్రత్యక్షమైంది శ్రీమతి —చేతిలో కాఫీ కప్పుతో.

రాత్రి ఎనిమిది గంట లయ్యింటుంది. పాప, బుజ్జి నిద్రపోతున్నారు. బాబు కూడ పుస్తకం ముందు పెట్టుకొని తూగుతుంటే రాత్రి జరిగిన దానిమీదట పెందరాలే పడుకోనిచ్చారు. మోహన్రావు ఏవో ఆఫీసు కాగితాలు చూసుకుంటున్నాడు. అతని భార్యకి ఇంకా వంటింట్లో పని కాలేదు.

ఆ సమయంలో రెండిళ్ళవతల ఉన్న దామోదరం ఇంట్లోంచి అతని కేకలు బిగ్గరగా వినిపించాయి. వాళ్ళ చిన్న పిల్లవాడి ఏడుపు కూడా వినిపిస్తోంది. పిల్లవాణ్ణి కొడుతున్నాడులా ఉంది. ఆ రోజు ఆఫీసులో జరిగిన దాని మీదట దామోదరం కేకలు వినగానే తని మీద అసహ్యం కలిగింది మోహన్రావుకి.

'వెధవ. ఎప్పుడూ చెండుకుతింటాడు పిల్లల్ని. పిల్లలు ఏమై పోతారోననే ఆలోచనకూడ ఉండదు. అదేమంటే పిల్లలకి భయముండాలట!

వాడి పెద్దపిల్లవాడికి తనంటే ఏం భయముంది? కొట్టీ కొట్టీ మొద్దుబారింది శరీరం. ఒళ్ళువాచే అప్పగిస్తాడు గాని చెప్పిన మాట వినడు. పదకొండేళ్ళు ఉంటాయో లేదో తల్లిదండ్రుల్ని ఎదిరిస్తాడు. వాడి పెడసరానికి వాడిని వీడు విరగ దీస్తుంటాడు. ఇదీ వరస!

కొట్టే ప్రయోజనం లేదనటానికి నిదర్శనం కళ్ళెదుట ఇంట్లోనే ఉన్నా అదేమీ బుర్రకెక్కదు వాడికి. చీటికి మాటికి పిల్లల్ని చితక బాదటమే వి! మూర్ఖుడు!

వాడి భార్యకూడా వాడికి తగ్గదే!

ఎక్కడైనా మగవాళ్ళు ఇంట్లో లేనప్పుడు 'మీ నాన్నని రానీయండి — మీ సంగతి చెప్తాను' అంటూ పిల్లల్ని భయపెడతారు ఆడవాళ్ళు. కానిల ఆవిడమాత్రం అలా కాదు. భర్త రాగానే పిల్లల మీద ఎక్కబోడుస్తుంది, కొట్టేటప్పుడు అడ్డు కూడ పోదు. అదేం మనస్తత్వమో! ఛీ! ఏం మనుషులు!'

తొమ్మిదిన్నర ప్రాంతంలో పని ఆపేసి పడుకున్నాడు మోహన్రావు.

మాగన్నుగా నిద్ర పడుతోందో లేదో మళ్ళీ పెద్దగా దామోదరం ఇంట్లో తిట్లు, కేకలు వినిపించి మెలకువ వచ్చింది.

వాళ్ళ పెద్ద పిల్లవాణ్ణి కొడుతున్నట్టుంది — వాడి ఏడుపు, పెడబొబ్బలు!

## అభ్యుదయం

పుణ్యాత్ములు
అభ్యుదయం కాంక్షిస్తున్నారు
అభ్యుదయ ఆహారం తింటూ
ప్రగతివాదులు నిరాహారదీక్ష చేస్తున్నారు
అభ్యుదయ సంగీతం వింటూ
యువకులు భవిష్యత్తుకు జోలపాడుతున్నారు
అభ్యుదయం కుండ బొజ్జల్లో దాచి
మహాశయులు దేశాన్ని లాలిస్తున్నారు.
అభ్యుదయాన్ని బాంక్ లాకర్లలో ఖైదీచేసి
పారిశ్రామికులు దేశశాంతిని పరిరక్షిస్తున్నారు
అంతా బాగానే ఉంది కాని
అభ్యుదయమే అర్థం కాలేదు.
ఏది అభ్యుదయం?
కులం మతం భాష ప్రాంతం
అరలు పొరలు తెరలు మరలు వెనక నక్కి
నక్కి జిత్తుల్లో సింహాలను కుక్కి
కుక్కిన పేనుల్లా చేసి,
ప్రాచీన వీధికి
బొట్టుపెట్టి పట్టం కట్టి భజన చేసి
ఎంగిలాకులు నాకే నేటి పట్టపగలును
మండుటెండ చౌరాస్తాలో ఉరివేసి
అంతరాత్మ ఆదేశాన్ని అక్షరాలా పాటిస్తున్నామని
ఆ విషాగ్నుల పురుటింటిలో
మంటల కాలాలు కట్టి గొంతుకు చుట్టి
ఊపిరి తీయటమా?
ఏది అభ్యుదయం?
గొప్ప ఉదయమా?
విశాంత ఉదయమా?
విశ్రాంత హృదయమా?
నిజం చెప్పలేక వేడి వాడి తగ్గిన
సూర్యుడు రావటమా?
పెగ్గు విడిచి దిక్కుచచ్చి సొమ్మసిల్లి
చంద్రుడు కుంకటమా?
పొద్దు కుంకిన తర్వాత ఉదయించి
పొద్దు పొడవక ముందే అస్తమించి
చీకటికి ఊపిరి పోసి
రాత్రిని నగ్నంగా భగ్నంగా
మత్తుగా చిత్తుగా
వీధి తొత్తుగా
విచ్చలవిడిగా
బజారు కుక్కగా
అరటి తొక్క తొక్కిపోయిన రోడ్డుగా
పగిలిన సీసా పెంకుల పోగుగా
పోయిన ప్రాణం పోగొట్టుకొన్న నెత్తుటి
రంగుగా
బద్దలైన శిలలా
ఉన్మాదమైన మానంలా
అరుస్తున్న మౌనంలా
వేటాడబడ్డ అహింసలా శాంతిలా
దయలా ప్రేమలా
పా. గి పోరలి వరదై పారిన వయస్సు గట్టర్‌లా
బట్ట లిప్పేసిన ముసలి కేబరే నర్తకిలా
సొమ్మసిల్లిన జూదగాడిలా మోసగాడిలా
మాయలాడిలా మాయలేడిలా
షాపుల నియాన్ లైట్లు మింగితే
ఆరిపోయే వీధి దీపాలలా
కూడు గూడు గుడ్డ లేనివాడికి
వాన కురిసిన రోజులా
పన్నెండు గంటలకే నూరేళ్ళు నిండిన రాత్రి
ఉదయంకోసం ఎదురుచూడటమా
అభ్యుదయం?
ఏది అభ్యుదయం?

—డా. కొలకలూరి ఇనాక్

బహు చికాకు వేసింది మోహనరావుకి. ఏమిటి వరసపెట్టి ఇలా పిల్లల్ని కొట్టటం. అందరూ నిద్ర పోయే సమయమని కూడా లేకుండా ఏమిటీ న్యూసెన్సు?

వెళ్ళి అడ్డుపడి నాలుగు చివాట్లు వేద్దా మని పించింది. కాని దామోదరం ప్రవర్తన మీద రోత పుట్టి 'ఎట్లాగన్నా చావనీ, నా కెందుకు' అనుకొని నిద్ర పట్టించుకొనే ప్రయత్నంలో ఉన్నాడు.

ఉన్నట్టుండి దామోదరం తిట్లు, పిల్లవాడి ఏడుపు ఆగిపోయి భయవిహ్వలతతో కూడిన అతని భార్య రోదన ఒక్కసారిగా తారాస్థాయిలో విని పించింది. గుండె జల్లుమంది మోహనరావుకి. భార్యని కేకేశాడు. ఏమిటో చూసొస్తానని దామోదరం ఇంటి కెళ్ళాడు. పక్క ఇళ్ళ వాళ్ళు కూడా కొద్ది మంది చేరా రక్కడికి.

• • •

అక్కడి దృశ్యాన్ని చూసి నిర్ఘాంతపోయాడు మోహనరావు.

వాళ్ళ పెద పిల్లవాడు నేలమీద నిర్జీవంగా పడి ఉన్నాడు. దామోదరం ముఖంలో నెత్తురు చుక్క లేదు. గుడ్లప్పగించి స్థాణువులా ఉండిపోయాడు. పిల్లవాడిమీదపడి అతని భార్య బోరున ఏడుస్తూంది. ఆమె దుఃఖం అవశ్యకంగాలేదు.

ఎంత ఘోరం! పిల్లవాణ్ణి చచ్చేలా కొట్టాడు దామో దరం! అంటే తను హత్యచేసినట్టే! కొట్టి చంపే శాడని బయటికి పొక్కి కిట్టని వాళ్ళు పోలీసులకి రిపోర్టుచేస్తే?

శవాన్ని శవ పరీక్షకి పంపుతారు. దామోదరాన్ని అరెస్టు చేస్తారు. ఏ శిక్ష పడుతుందో? అప్పుడతని కుటుంబం గతేంకాను?

ఉదయమే కదా తన నీ విషయంలో ఆఫీసులో అవహేళన చేశాడు. ఇంతలోనే ఇలా జరగడమేమిటి?

ఆమె అలానే ఏడుస్తుంటె ఇంకా జనం పోగై ఈ విషయం అందరికీ పాకిపోదూ? అప్పుడు పోలీసులకి మాత్రం తెలియకుండా ఉంటుందా! ఈ స్థితిలో రానున్న ప్రమాదాన్ని గ్రహించ గలరా వీళ్ళు?


మోహనరావు దామోదరం దగ్గరకెళ్ళి అతని భుజం మీద చెయ్యి వేశాడు.

దామోదరం మోహనరావు ముఖంలోకి చూశాడు. ఆ ముఖంలో కలగలిసిన అనేక భావాలు—దుఃఖం, ఆవే దన, భయం, పశ్చాత్తాపం!

మోహనరావుని చూడగానే దుఃఖం పెల్లుబి కింది. అతని చేతులు పట్టుకుని బావురుమన్నాడు దామోదరం.

అతన్ని అనునయించి చెవి దగ్గర ఏదో చెప్పి బయటికి తీసుకెళ్ళాడు. అతని బంధు వొకతను కూడా వాళ్ళని అనుసరిస్తే ఇద్దరికీ పొంచివున్న ప్రమా దాన్ని గురించి చెప్పి అల్లరి చేసుకోవద్దని, అడిగిన వాళ్ళకి ఏదో కారణం చెప్పి తెల్లవారాక త్వరగా అంత్య క్రియలు జరపమని సలహా ఇచ్చాడు.

దామోదరం భయంతో వణికిపోయాడు. ఆందో ళనతో లోపలికి వెళ్ళి భార్యకి నచ్చచెప్పి లోపలికి తీసుకెళ్ళాడు. కొద్దిసేపటికి ఇద్దరూ బయటి కొచ్చారు. ఆమె సన్నగా రోదిస్తూ కొడుకు శవం పక్కన కూర్చుంది.



సంక్రాంతి శోభ


ఫోటో — ఎస్. కృష్ణారెడ్డి

కాసేపు ఆగి మోహనరావు దామోదరాన్ని ఎవరగాలేని చోటుకి తీసుకెళ్ళి ఏం జరిగిందని అడి గాడు. అతను ఏడుపు నాపుకుంటూ చెప్పాడు.

తన పెన్నుపోతే ఆ రోజే ఖరీదైన పెన్ను కొని ఇంట్లో పెట్టాడట. బజారు నుంచి ఇంటికొచ్చి పెన్నుతో పనిబడిదాన్నితీస్తే పాళీ చిట్లిపోయి ఉందట. కొత్తపెన్ను కొన్న రోజే పాడు చేశారన్న కోపంతో చిన్నవాడికి రెండు అంటించాడట. వాడేమో పెన్ను తను రాయలేదని అన్నయ్యే రాశాడని చెప్పాడట. పెద్దవాడి కోసం చూస్తే వాడు ఇంట్లోలేడు. సినిమా కెళ్ళాడుట. పెన్ను పాడుచేయటమే కాకుండా చెప్ప కుండా సినిమా కెళ్ళాడని పట్టలేని కోపమొచ్చిందట. వాడు సినిమా నుంచి రాగానే కోపాన్ని అదుపులో పెట్టుకుంటూ 'పెన్నుతో రాశావా? అని అడిగాడట, వాడు "నాకెమీ తెలియదన్నాడట. "ఇన్ని చేసి నిర్భ యంగా అబద్ధాలు కూడా ఆడుతున్నాడా అని ఒళ్ళు తెలియని కోపంలో కర్రపుల్లతో ఎడాపెడా కొట్టా డట. ఒక దెబ్బ తగలగానే 'అమ్మా' అనే వెర్రికేకతో కిందపడిపోయాడట. వాళ్ళమ్మ వచ్చి పిల్లవాణ్ణి కుదిపి పలకరిస్తే చలనం లేదట ఏం జరిందిం అనే ఆలోచనరాగానే తన మనసు స్తంభించిపోయిం దట.

ఆ విషయం విని మోహనరావు దిగ్భ్రాంతిచెందాడు ఎంతన్యాయం వేదం!—ఎంత దారుణమైన శిక్ష! అల్ప మైన పెన్నుపాళీకి అమూల్యమైన ప్రాణాలు పరి హారమా! పాళీ మరొకటొస్తుంది గాని పిల్లవాడు తిరిగొస్తాడా? పిల్లలుకావాలని కని చేతులారా చంపుకో టంలో అర్థమేమిటి?

అదే....కాస్త సహనం వహించి పిల్లల్ని దగ్గరికి పిలిచి వాళ్ళలా చేసి ఉండ కూడదని మంచిగా చెప్పి ఉంటే మరోసారి వాళ్ళే జాగ్రత్తపడేవారు. ఇంత ఘోరం జరిగేదికాదు. పిల్లలకి క్రమశిక్షణ నేర్పాలిగాని శిక్షించటం పరిష్కారం కాదు. అన్ని అనర్థాలకీ మూలం మనిషిలోని పశుత్వాన్ని చంపుకో




లేక పోటం! దాన్ని జయించలేనంత కాలం ఈ దారుణం తప్పదు!

మోహనరావు మనసు చెదిరిపోయింది. ఉదయాన్నే వస్తానని చెప్పి ఇంటి ముఖం పట్టాడు.

* * *

మరునాడు ఉదయం అంత్యక్రియలకి హాజరయ్యేందుకు ఒక పూట శలవు పెట్టి మోహనరావు దామోదరం ఇంటికివెళ్ళాడు.

బాలుడి భౌతిక కాయాన్ని మరుభూమికి తరలిస్తున్నప్పుడు రోదనలు మిన్నుముట్టిన హృదయ విదారక దృశ్యం మోహనరావు మనసుని కలచివేసింది.

సర్వజనావళికి మా సంక్రాంతి శుభాకాంక్షలు
శ్రీ పార్వతి
శ్రీ పార్వతి బుక్ స్టాల్
యస్.పి.యం. ఎంపోరియమ్
కంచరపాలెం... విశాఖ-8

శవాన్ని శ్మశాన వాటికకు చేర్చారు. అక్కడి తంతు ముగిశాక ఖననం చేయటానికి మృత దేహంపై ఉన్న బట్టలు తొలగిస్తున్నప్పుడు అలా చేయవద్దని దామోదరం వారిని వారించాడు. ఆ చర్యకి అందరూ విస్మయం చెందారు.

''ఇదేలాగయ్యా? పద్ధతి ప్రకారం బట్టలుండ కూడదు!'' అని ఒక పెద్దాయన చెప్పాడు.

''అంత నుట్టి ఒట్టివంటి మీదే వేస్తారా?'' అంటూ శోకతప్తుడై శిరస్సుదించుకున్నాడు దామోదరం.

ఆ మాటలు విన్న అందరికీ అతనిపై జాలి వేసింది.

బ్రతికున్నప్పుడు పిల్లల బాధ గమనించకుండా చమ్మంచిట్లగొట్టే ఇతను ఇప్పుడు జీవంలేని శరీరానికి నొప్పి కలుగుతుందని బాధ పడుతుంటే మొదలు మనసులో హేళన భావం కలిగినా అతనిలో మేల్కొన్న పితృవాత్సల్యానికి అందరి హృదయాలూ ద్రవించాయి.

• • •

సాయంత్రం ఆఫీసుకెళ్ళాడు మోహనరావు, దామోదరం ఇంటికి వెళ్ళని వాళ్ళంతా అతని చుట్టూ చేరి దామోదరం కొడుకు మరణాన్ని గురించి అడుగుతున్నారు. మోహనరావు అసలు విషయం చెప్పకుండా మరేదో కల్పించి చెప్పాడు. కాని నారాయణసింగ్ మాత్రం అతను చెప్పింది కొట్టిపారేశాడు.

సింగు, దామోదరం బద్ధశత్రువులు. ఒకరిమీద మీదొకరు దెబ్బతీయటానికి ఎక్కడ చాన్సు దొరుకుతుందా అని ఎదురు చూస్తుంటారు.

నిజం తనకి తెలియకపోలేదని, దామోదరం కొడుకుని కొట్టి చంపాడని అతన్ని వెంటనే పోలీసులకి పట్టివ్వాలని, అప్పుడు గాని ఇలాంటి వారికి శాస్తి జరగదని మర్భాషలాడటం మొదలు పెట్టాడు.

అతని వూపు చూస్తే నిజంగానే పోలీసులకి రిపోర్టు చేసేలా ఉన్నాడని మోహనరావు అతన్ని దగ్గరికి పిలిచి శాంతింప జేయటానికి ప్రయత్నించాడు.

''హత్యలు చేసిన వాళ్ళని పోలీసులకి పట్టివ్వాల్సిందే! కాదనను. కాని శిక్ష అనుభవించిన వాళ్ళని ఇంకా పోలీసులకి పట్టివ్వాలిసిన పనేముంది?''

అతను చెప్పింది ఏదో తికమకగా ఉంది సింగుకి.

''నీ స్నేహితుడు గాబట్టి నువ్వేవో కబుర్లు చెబుతావ్. కాకపోతే శిక్ష తప్పించుకున్న వాణ్ణి పట్టుకుని శిక్ష అనుభవించాడంటావేమిటి?''

''నీ ఉద్దేశంలో జైల్లో ఖైదీగా ఉంటేనే శిక్ష అనుభవించటం. కాని జైలు శిక్షకి పరమార్థం నేరస్థుడిలో పశ్చాత్తాపం కలిగించటమే! దామోదరం ఇప్పటికే పశ్చాత్తాపాగ్నిలో మాడిపోతున్నాడు. ఇంకా అతనికి శిక్ష దేనికి?''

''పశ్చాత్తాపం లేదు—పాడూలేదు—పిల్లల్ని పీక్కు తినే రాక్షసుడికి పశ్చాత్తాపం ఏమిటి? జనం మెప్పు కోసం అంతా నాటకం!''

''కాదు సింగూ! జరిగింది వింటే నువ్విలా తొందరపడవ్. ప్రత్యక్షసాక్షిని నేనున్నాగదా. అతను పడేనరకయాతన విరోధులకికూడా వద్దనిపిస్తుంది!''

సింగు అనుమానదృష్టితో, మిగతా వాళ్ళు ఆసక్తితో వింటున్నారు.

''అంత్యక్రియలయ్యాక అంతా ఇంటికి చేరాం. కొంతసేపు దామోదరానికి తోడుగా ఉండే ఉద్దేశంలో ఇద్దరు ముగ్గురు అతని దగ్గర కూర్చున్నారు. ఒక పూట శెలవుంది కదా అని నేనూ కూర్చున్నాను.

మా మధ్య శ్మశాన వైరాగ్యపు మాటలు దొర్లుతున్నాయ్. ఇంతలో దామోదరం పాప గడప దగ్గర కొచ్చి మమ్మల్ని వాళ్ళ నాన్నని మార్చి మార్చి చూస్తూంది.

ఆ పాప అంటే దామోదరానికి ప్రాణం. ఆ అమ్మాయి పుట్టిన తరవాత కలిసొచ్చిందని నమ్మకం. ఆ అమ్మాయిని మాత్రం ఎప్పుడు కొట్టడు. ఆడపిల్ల లక్ష్మితో సమానమని, వాళ్ళని సున్నితమైన శరీరాలు గనక కొట్టకూడదని అతని అభిప్రాయం. పాపని ఎప్పుడూ కొట్టడూ. మమ్మల్నే ఎప్పుడూ తంతాడు.! అని మగపిల్లలు అసూయ పడటం కూడా నాకు తెలుసు.

పాపని రమ్మని సైగచేశాను. రాలేదు. దామోదరం ఆప్యాయంగా! ''దా, అమ్మా—దా'' అంటూ తీసుకోవటానికి పైకి లేచాడు.

పాప భయపడిపోతూ ''నేను రాను. నువ్వు చంపేస్తావు!'' అంటూ లోపలికి పరుగెత్తింది.

సింగూ! ఆ క్షణంలో దామోదరం ముఖంలో కనిపించిన చిత్రహింస వర్ణించటానికి వీలులేనిది. తల్లీ! . . . .అని నుదురు కొట్టుకుని ఆక్రందిస్తూ నరనరాన్ని నరికివేస్తున్నట్టుగా నేల కూలిపోయాడు. . . . .ఎంత కటిన కారాగారశిక్ష అయినా ఆ శిక్షకి సరితూగగలదంటావా?''

అప్రతిభులై చూస్తుండిపోయారు వింటున్న వారంతా!

*